క్లుప్తంగా

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కరప: మండలం వేళంగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 12వ తేదీ నుంచి జరిగే ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సంప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు చీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్) ఆచంట అంజిబాబు తెలిపారు. వేళంగిలో శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 219 మంది, ద్వితీయ సంవత్సరంలో 70 మంది పరీక్షలు రాస్తున్నారన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్ట్ ఇంటర్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండ్ ఇంటర్ పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులను అరగంట ముందు పరీక్ష హాలులోకి పంపుతామని, నిర్దేశించిన సమయానికి ఆలస్యంగా వస్తే ఎట్టి పరిస్థితులలో అనుమతించబోమన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. డీఓగా జెస్సీ డానియేల్‌ను నియమించినట్లు ఆయన చెప్పారు.

నిత్యావసర సరకుల పంపిణీ

కాకినాడ రూరల్: రమణయ్యపేటలో కోరమాండల్ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేద మహిళలకు శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సంఘ కార్యదర్శి శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి నెలా పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జి.కృష్ణమోహన్, శాంతి, మాధవి లత, పద్మ, దీపిక, అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ఓం నమశ్శివాయ, కుమార్ యాదవ్, బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పండిత సదస్యం



కల్యాణోత్సవాలలో భాగంగా పండిత సదస్యం నిర్వహిస్తున్న అర్చకులు

కాకినాడ రూరల్: సర్పవరంలో రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి వారి కల్యాణ మహోత్సవాలలో భాగంగా శనివారం పండిత సదస్యం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వాములు ఆలయ ప్రాంగణంలో మండపంలో స్వామి వారిని ఉంచి పండిత సదస్యం చేశారు. ఉత్సవాలలో భాగంగా ఉదయం ప్రత్యేక పూజలు, హోమం, సాయంత్రం ఊరేగింపు నిర్వహించారు.

కాకినాడ అధికారుల ఫోన్ నెంబర్లు

మున్సిపల్ అధికారులు	
కమిషనర్	9100945696
అదనపు కమిషనర్	9849907096
డిప్యూటీ కమిషనర్	9949921555
ఏసీపీ	9989743049
ఎంహెచ్‌వో	9949432320
ఎస్ఈ	9959988639
మేనేజర్	7093519888
టీపీఆర్వో	9701385284
అకౌంట్ ఆఫీసర్	9849907084
సిటీ మిషన్ మేనేజర్	7901610084
పంచాయతీ అధికారుల ఫోన్ నెంబర్లు	
డివిజనల్ పంచాయతీ అధికారి	9849903188
ఫుడ్ ఇన్‌స్పెక్టర్	9494297564
ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ	9100121109
జిల్లా వ్యవసాయశాఖాధికారి	8331056483
దేవదాయశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్	9290145126
గృహ నిర్మాణశాఖ డీఈ	7093930577
పశుసంవర్ధకశాఖ జేడీ	9989932835
డీసీసీబీ జీఎం	8341208227
జిల్లా సహకారశాఖ అధికారి	9100109168
జీజీహెచ్‌లో ముఖ్యమైన ఫోన్ నంబర్లు	
సూపరింటెండెంట్	98499 03870, 0884 2302001
సీఎస్ ఆర్‌ఎంవో	98499 03871
డీసీఎస్ ఆర్‌ఎంవో	98499 03871
ఆర్‌ఎంవో	0884 2302003
డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్	0884 2302002
అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)	98499 03873, 0884 2302004
పోలీస్ అవుట్‌పోస్ట్	83329 57924
అత్యవసర విభాగం	0884 2302021
బ్లడ్ బ్యాంక్	0884 2302009
మెడికల్ రికార్డ్స్ సెక్షన్ (ఎంఆర్‌డీ)	0884 2302018

కరప మండల అధికారుల ఫోన్‌నంబర్లు

ఎంపీడీఓ	9346790819
తహసీల్దార్	9849903908
ఈఓ పీఆర్ ఆర్డీ	9849352293
మండల ఇంజనీరింగ్ అధికారి	8886865417
మండల వ్యవసాయాధికారి	8331056589
ఎంఈఓ-1	8008293994
ఎంఈఓ-2	8919940656
హౌసింగ్ ఏఈఈ	7093930450
ఉపాధిపథకం ఏపీఓ	7093998259
వెలుగు ఏపీఎం	9959989273
ఎలక్ట్రికల్ ఏఈ	9440812638
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ	9603007219
ఇరిగేషన్ ఏఈఈ	9704651826
డ్రెయినేజ్‌శాఖ ఏఈఈ	9963744219
ఆర్అండ్‌బి ఏఈఈ	9440818530
కరప పీహెచ్‌సీ డాక్టర్	8096940176
వేళంగి పీహెచ్‌సీ డాక్టర్	9962553545
పశుసంవర్ధకశాఖ ఏడీ	9490047668
నడకుదురు వెటర్నరీడాక్టర్	9652547579
వేళంగి వెటర్నరీ డాక్టర్	8332973558
అరట్లకట్ట వెటర్నరీ డాక్టర్	9494671642
ఫిషరీస్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్	9704512131

తుల్యభాగం అందిందా!

- కొంగోడు వంతెన నిర్మాణం ప్రశ్నార్థకం
- రూ.3 కోట్లు కొల్లగొట్టిన కాంట్రాక్టర్
- నోటీసులు ఇచ్చినా స్పందించని వైనం
- కానరాని ఇరిగేషన్ అధికారుల చర్యలు



కొంగోడు వద్ద తుల్యభాగ డ్రెయిన్‌పై వంతెన నిర్మాణానికి వేసిన శిలాఫలకం



పునాది స్థాయిలోనే పెచ్చులూడి, శిథిలమవుతున్న వంతెన పిల్లర్లు

కరప: పై చిత్రంలో కనపడుతున్న నిర్మాణాలు ఏ మొఘలుల కాలంలో నిర్మాణాలో.. పురావస్తు శాఖ అధికారులు ఆదేశాలతో స్థానికులు జాగ్రత్తగా కాపాడుతున్నారేమో అనుకుంటున్నారా..? ఆగండాగండి.. అవి ఓ కాంట్రాక్టర్ అవినీతికి, అతనికి అండగా నిలచిన అధికారుల వైఫల్యాలకు ఆనవాళ్లు. ఏడున్నరేళ్ల క్రితం పనులు మొదలుపెట్టి.. 60 శాతం నిధులు దక్కించేసుకుని ఆనక ముఖం చాటేసిన ఓ బడాబాబు ఘనకార్యమిది. ఎవరి ముడుపులు వారికి చేరితే ఎవరు పట్టించుకుంటారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. తుల్యభాగ డ్రెయిన్‌పై కొంగోడు వద్ద చేపట్టిన వంతెన నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేయడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వంతెన నిర్మాణానికి భూమిపూజ చేసి ఏడున్నర ఏళ్లయినా పనులు ఎక్కడివేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉంది అక్కడి పరిస్థితి. చేసిన పనికి రూ.మూడు కోట్ల వరకు వ్యయమయ్యాయి. వేసిన పిల్లర్ల కాంక్రీట్ కొట్టుకుపోయి, ఊసలు బయటకు వచ్చి, తుప్పుపట్టాయి. వంతెన పనులు పునః ప్రారంభించినా, నేల మట్టాలనికి వేసిన పిల్లర్లు పూర్తిగా తొలగించాల్సిన పరిస్థితి నెలకొంది. పంట ఉత్పత్తులు తెచ్చుకోవడానికి, పొలాలకు వెళ్లివచ్చేందుకు వంతెన ఉపయోగంగా ఉంటుందనుకుంటే నిరాశే ఎదురవుతోందని, డ్రైనేజీ శాఖాధికారుల పనితీరు సైతం అలానే ఉందని రైతులు అంటున్నారు. మండలంలోని కొంగోడు రైతులకు చెందిన పొలాలు వేములవాడ, కరప పొలిమేరలలో ఉంటాయి. వారి పొలాలకు రాకపోకలు సాగించాలన్నా, పంట ఉత్పత్తులు తెచ్చుకోవాలన్నా తుల్యభాగ డ్రెయిన్ దాటాల్సి ఉంటుంది. అటు కాజులూరు మండల వాసులు కరప మండలం రావాలన్నా కొంగోడు మీదుగా ఈ డ్రెయిన్ దాటాలి. పంట ఉత్పత్తులు తెచ్చుకోవాలన్నా, దమ్ము ట్రాక్టర్లు వెళ్లాలన్నా ఆరు కిలోమీటర్లు చుట్టూ తిరిగి గొర్రిపూడి మీదుగా ఏటిగట్టు మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. అదే తుల్యభాగ డ్రెయిన్‌పై కొంగోడు వద్ద వంతెన నిర్మిస్తే రైతులకు, రెండు మండలాల వారికి దగ్గరి దారి ఏర్పడుతుంది.



తుల్యభాగ డ్రెయిన్‌పై వంతెన నిర్మాణం చేపట్టినది ఇక్కడే



కాంక్రీట్ ధ్వంసమై, ఊచలు తుప్పుపట్టిన పిల్లర్

కాంట్రాక్టర్‌ను విస్మరించడంలో ఆంతర్యమేమిటో!

2017లో అప్పటి ప్రభుత్వం రూ.5.19 కోట్లు మంజూరు చేయగా ఆ ఏడాది డిసెంబర్ 30న ఎన్టీఆర్ వారధి పేరిట అప్పటి ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. తర్వాత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి పిల్లర్లు నిర్మించారు. భూమి స్థాయి వరకు నాలుగు పిల్లర్లు వేసి 2018 నుంచి పనులు నిలిపివేశారు. దీంతో పిల్లర్లకు వేసిన ఊచలు తుప్పుపట్టి, కాంక్రీటు పెచ్చులుగా ఊడిపోతోంది. వంతెన నిర్మాణానికి రూ.5.19 కోట్లు మంజూరు చేస్తే, అప్పటి వరకు చేసిన పనులకు రూ.3.01 కోట్లు చెల్లించినట్టు అధికారులు చెప్తున్నారు. మొత్తం వ్యయంలో 60 శాతం నిధులను కాంట్రాక్టర్‌కు ముందే ముట్టజెప్పేస్తే డ్రైనేజీ అధికారులు ఏం చేస్తున్నట్టని పలువులు విమర్శిస్తున్నారు. కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులిపేసుకుంటారా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. సామాన్య ప్రజలు ఏ మాత్రం బకాయిలున్నా ఆర్ఆర్ చట్టం అంటూ హడావుడి చేసే అధికారులు ఈ కాంట్రాక్టర్‌ను ఎలా వదిలేశారని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా వంతెన పనులు ప్రారంభించి, పూర్తిచేసేలా సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చారు

తుల్యభాగ డ్రెయిన్‌పై వంతెన నిర్మాణ పనులు నిలచిన మాట వాస్తవమే. చేసిన పనులకు ఐదు బిల్లులుగా రూ.3.01 కోట్ల చెల్లించాం. 2019 నుంచి పనులు నిలిపివేయడంతో ఇప్పటి వరకు ఎనిమిది సార్లు నోటీసులు ఇచ్చాం. కాంట్రాక్టర్ తీరును కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాం. వంతెన నిర్మాణ పనులు ప్రారంభించకపోతే బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని పది రోజుల క్రితం తమ శాఖ ఎస్ఈ నోటీసు ఇచ్చారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు చర్యలు తీసుకుంటాం.

– క్రాంతి, ఏఈఈ, డ్రైనేజీ శాఖ

వంతెన లేక అదనంగా ఖర్చవుతోంది



తుల్యభాగ డ్రెయిన్‌పై వంతెన లేక పొలాలకు వెళ్లి రావాలన్నా, పండించిన పంట తెచ్చుకోవాలన్నా గొర్రిపూడి మీదుగా రావడం వల్ల అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. పొలాలకు వెళ్లి వచ్చేందుకు రవాణా ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి.

కొప్పాడ నాగేశ్వరరావు, కొంగోడు

భక్తిశ్రద్ధలతో కనకదుర్గ విగ్రహ ప్రతిష్ఠ



కరప: స్థానిక హైస్కూల్ సెంటర్ వద్ద ఉన్న దుర్గాదేవి ఆలయంలో కనకదుర్గ అమ్మవారి 37వ ప్రతిష్ఠా మహోత్సవాన్ని శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ అర్చకులు కొంపెల్ల చక్రధరరావు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూర్ణాభిషేకం, కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలు చేశారు. భక్తులు సమకూర్చిన వెండి, బంగారు ఆభరణాలతో అమ్మవారిని అలంకరించారు. భజన బృందాలతో ఏకాహం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానానికి పరిసర గ్రామాల నుంచి పది వేల మంది భక్తులు హాజరై అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పాకిస్తాన్ జెండా తొలగించాలి

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ఆవరణలో గత ఏడాది ఇన్‌చార్జి వీసీగా వ్యవహరించిన ప్రొఫెసర్ మురళీకృష్ణ వర్సిటీ పరిపాలన విభాగం ఎదుట ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 194 జెండాల జెండాలను ఏర్పాటుచేసి వాటికి క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశారు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా ఆ దేశ విశిష్టత, భూగోళం, జనాభా తదితర విషయాలన్నీ వచ్చేలా ఏర్పాటు చేశారు. దానిలో భాగంగా పాకిస్తాన్ జాతీయ జెండా ఉండటంతో భజరంగ దళ్, విశ్వహిందూ పరిషత్ సంఘాల ఆధ్వర్యంలో జెండా తొలగించాలంటూ నినాదాలు చేశారు. ముందస్తు జాగ్రత్తగా ఏ విధమైన సంఘటనలు జరగకుండా సెక్యూరిటీ సిబ్బందితో పాటు పోలీసులు అప్రమత్తం అవ్వడంతో వర్సిటీ అధికారుల ఆదేశాల మేరకూ జెండాను తొలగించారు.

నీ ఆశీస్సులే నాకు బలం అమ్మా!



తల్లుల కాళ్లు కడుగుతున్న పిల్లలు

- తల్లులకు కాళ్లు కడిగి ఉపచారాలు
- పిల్లలను ఆశీర్వదించిన మాతృమూర్తులు
- అంగన్‌వాడీల వినూత్న కార్యక్రమం

కాకినాడ క్రైం: అమ్మా.. పూజలందుకో అంటూ పిల్లలు తమ తల్లులను పూజించిన తీరు ఆకట్టుకుంది. ఆదివారం మాతృ దినోత్సవం సందర్భంగా కాకినాడలోని జేపీ-1 సెక్టార్ పరిధిలోని గోళీలపేట అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం తల్లికి వందనం పేరుతో ఈ వినూత్న కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ విజయ కుమారి పర్యవేక్షణలో, సీడీపీఓ జ్యోతి ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ బత్తిన ప్రభావతి అంగన్వాడీ కార్యకర్తలతో కలసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 25 మంది తల్లులను పిల్లలతో కలిసి కేంద్రానికి పిలిచి పిల్లల చేత కాళ్లు కడిగి, పూజ చేయించారు. అచ్చం అమ్మవారిలా అమ్మకీ పూజాదికాలు నిర్వహించారు. పిల్లలు తమ తల్లుల కాళ్లు కడిగి బట్టతో తుడిచి ఆ నీళ్లను నెత్తిన చల్లుకున్నారు. పిల్లలు తమ తల్లులకి బహుమతులు ఇచ్చారు. మిఠాయిలు తినిపిస్తూ మురిసిపోయారు. అమ్మను అలరించేందుకు నృత్యరూపకాలు ప్రదర్శించారు. తల్లి దీవెనలు కాంక్షిస్తూ మాతృదేవోభవ అంటూ గొంతు సవరిస్తూ పాటలందుకున్నారు. తల్లులు తమకి నేర్పిన మంచి అలవాట్లపై పోస్టర్ ప్రదర్శన చేపట్టారు. అంగన్‌వాడీ టీచర్లు పి.దయావతి, వై.శ్రీవల్లి, కె.సరోజినీదేవి, ఎం.శ్రీనమ్మ, వి.పోసిరత్నం, ఆర్.పార్వతి, పి.సుజాత, ఎం.నూకరత్నంతో పాటు ఎంఎస్‌కేలు, ఏఎన్ఎం పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడాకారులను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరాజు, రెక్టార్ రమణ

బాలాజీచెరువు: క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందని జేఎన్‌టీయూకే వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో శనివారం క్రీడా దినోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ క్రీడలు మనిషికి మానసిక, శారీరక ఆరోగ్యాన్ని అందిస్తాయని, పాఠశాల స్థాయి నుంచి క్రీడలపై ఆసక్తి కలిగి ఉండాలన్నారు. రెక్టార్ కేవీ రమణ, వర్సిటీ ద్వారా క్రీడలకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని వివరించారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ శ్యామ్‌కుమార్ 2024-25 విద్యాసంవత్సరంలో వర్సిటీ తరపున క్రీడలలో పాల్గొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన వారి నివేదిక వివరించారు. అనంతరం ప్రతిభ చూపిన క్రీడాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాలేజియేట్ టోర్నమెంట్ కార్యదర్శి డాక్టర్ జీపీ రాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.

తోబుట్టువుల్లా నర్సుల సేవలు



సమావేశంలో పాల్గొన్న హెడ్ నర్సులు

- జీజీహెచ్ సూపరింటెండెంట్ విఠల్

కాకినాడ క్రైం: రోగులకు తోబుట్టువుల్లా నర్సులు సేవలందిస్తారనీ, ఆసుపత్రిలో రోగులకు అధిక సమయం సేవలందించేది వారేనని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ అన్నారు. శనివారం జీజీహెచ్‌లోని కాన్ఫరెన్సు హాల్లో హెడ్ నర్సులతో సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వానపల్లి వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డాక్టర్ విఠల్ మాట్లాడుతూ, నర్సింగ్ సేవల్లో మరింత నాణ్యతను పెంపొందించేందుకు శాస్త్రీయ విధానాలను అవలంబిస్తున్నట్లు తెలిపారు. రోగులకు వైద్యుడి కంటే నర్సే అధిక సమయం సేవలందిస్తారని, వారు అందిస్తున్న సేవల్లో మరింత నాణ్యతను వృద్ధి చేయడం ద్వారా రోగులు సంతృప్తి చెంది త్వరగా కోలుకుంటారన్నారు. సేవలందించడంలో నర్సులకు ఎదురవుతున్న సాధారణ ఆటంకాలు, సమస్యలపై దృష్టి సారించామన్నారు. మందుల లభ్యత, పరికరాల పనితీరు తదితర అంశాలను పరిశీలించి వారి సేవలకు మరింత చేయూతనిచ్చేలా ప్రణాళికలు రచించి అమలు చేస్తున్నామన్నారు. అయితే, రోగులకు అత్యుత్తమ సేవలు అందించేందుకు నర్సులు మరింతగా కట్టుబడి ఉండాలని సూచించారు. తగిన జ్ఞానాన్ని పెంపొందించుకుని వృత్తిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్, ఏఆర్ఎంవో డాక్టర్ వై.లావణ్య, నర్సింగ్ సూపరింటెండెంట్లు సంధ్యారాణి, ఫ్లోరెన్స్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర ధరలపై సమీక్ష

బోట్‌క్లబ్: ధరలను అదుపులో ఉంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం దిశానిర్దేశం చేసిందని జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.సత్యనారాయణ రాజు అన్నారు. జిల్లాలోని పప్పు దినుసుల వర్తకులు, కిరాణా మర్చంట్ అసోసియేషన్, బియ్యం వ్యాపారులు హోల్‌సేల్, రిటైల్ వర్తకులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్స్, పౌర సరఫరాల సిబ్బందితో పౌరసరఫరాల శాఖ కమిషనర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సత్యనారాయణ రాజు మాట్లాడుతూ నిత్యం అన్ని నిత్యావసర వస్తువుల ధరలపై పర్యవేక్షణ చేస్తున్నట్టు తెలిపారు. వారం, నెల, సంవత్సరం ప్రాతిపదికన ధరలపై సమగ్రంగా చర్చించినట్టు తెలిపారు. ఎప్పటికప్పుడు ధరలను అదుపులో పెట్టడంపై సూచనలిచ్చారు. జిల్లా ప్రజలు ధరల విషయంలో ఎటువంటి ఇబ్బందీ పడకుండా వ్యాపారులు నిత్యావసర వస్తువులను అందుబాటులో ఉంచాలని జిల్లా పౌర సరఫరాల అధికారి రుద్రరాజు సత్యనారాయణరాజు తెలిపారు.

యునైటెడ్ సీటీ స్కాన్ సేవలు ప్రారంభం



సీటీ స్కాన్ సేవలు ప్రారంభిస్తున్న డాక్టర్ విఠల్

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో యునైటెడ్ సీటీ స్కాన్ సేవలు ప్రారంభమయ్యాయి. ఆసుపత్రిలోని సీటీ స్కాన్ కేంద్రంలో ఈ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ ఈ యంత్రాన్ని ప్రారంభించారు. గతంలో ఉన్న సీటీ స్కాన్ సామర్థ్యం 16 స్లయిసెస్ అయితే నూతన యంత్రం సామర్థ్యం 80 స్లయిసెస్ అని డాక్టర్ విఠల్ అన్నారు. కచ్చితమైన రోగనిర్ధారణ మరింత సులువవుతుందని తెలిపారు.

డిజిటల్ బోర్డు ఇంటరాక్టివ్ టీవీ ప్రారంభం

కాకినాడ జీజీహెచ్‌లో ఆర్థోపెడిక్ సెమినార్ హాల్లో రాష్ట్ర డీఎంఈ డాక్టర్ డీఎస్‌విఎల్ నరసింహం డిజిటల్ బోర్డు ఇంటరాక్టివ్ టీవీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, వైద్య విద్యా బోధనకు ఎంతగానో సహకరిస్తుందని తెలిపారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపిఆర్ విఠల్, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్లు డాక్టర్ శశి, డాక్టర్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

విష్ణ్వాలయంలో వేణుగాన కచేరీ



పెనుగుదురు విష్ణ్వాలయంలో వేణుగాన కచేరీ నిర్వహిస్తున్న భైరవభట్ల శిష్యబృందం

కరప: మండలం పెనుగుదురులోని విష్ణ్వాలయంలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక కల్యాణం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించిన విషయం పాఠకులకు తెలిసిందే. స్వామి, అమ్మవార్లకు అర్చకుడు గోవర్ధన సూర్యనారాయణ పూజాదికాలు నిర్వహించారు. వేణుగోపాలస్వామి కల్యాణోత్సవంలో భాగంగా మూడో రోజు శనివారం రాత్రి భైరవభట్ల శర్మ(చిట్టిబాబు) శిష్యబృందంతో నిర్వహించిన వేణు గాన కచేరీ అందరినీ అలరించింది. ఆలయ ఈఓ ఎ.అపర్ణ, కె.రఘు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విశాఖపట్నం చరిత్ర పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

బాలాజీచెరువు: స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో రచయిత ర్యాలి ప్రసాద్ రచించిన విశాఖపట్నం చరిత్ర పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి, లక్ష్మిరాజ్యం దంపతులు ఈ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ ఈనాటి తరానికి విశాఖపట్నం విశిష్టత తెలిపేలా పుస్తకం రచించడం సంతోషంగా ఉందన్నారు. చరిత్ర రచనలు రాబోయే తరాలకు చాలా అవసరమన్నారు. రచయిత ర్యాలి ప్రసాద్ మాట్లాడుతూ గౌతమ బుద్ధుని కాలం నుంచి విశాఖపట్నం చారిత్రాకంగా తన ప్రత్యేకతను చాటుకుంటూ వస్తోందని, ఆ చరిత్ర నేటి తరానికి అందించాలనే ఉద్దేశంతో పుస్తకం రచించానన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.బుచ్చిరెడ్డి, ఎం.సూర్యభాస్కర్, వడిశెట్టి భాస్కర రెడ్డి, సత్యనారాయణ, కె.రామరాజు పాల్గొన్నారు.

అరుణోదయ సభలను జయప్రదం చేయండి

రైతు కూలీ సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్

పిఠాపురం: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య 50 వసంతాల ముగింపు సభలను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ పిలుపునిచ్చారు. గొల్లప్రోలు జగనన్న కాలనీలో శనివారం ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి, భుక్తి ఈ దేశ విముక్తి కోసం సాగిన పోరాటాల్లో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తన కలలతో ప్రజలను చైతన్య పరుస్తూ కీలక భూమిక పోషించిందన్నారు. సమాఖ్య ఉస్మానియా యూనివర్సిటీలో 1974లో జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ సారథ్యంలో పురుడు పోసుకుని 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా 2024 డిసెంబర్లో హైదరాబాదులో పెద్ద ఎత్తున సభలను నిర్వహించారన్నారు. దానికి కొనసాగింపుగా ఈ నెల 12న హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ముగింపు సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సభను ప్రజా కళాకారులు, విప్లవ సానుభూతిపరులు, విద్యార్థి, మేధావులు, కార్మికులు, కర్షకులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మధ్యభారత్ అడుగుల్లో ఆపరేషన్ కగార్ పేరుతో జరుగుతున్న ఆదివాసుల హత్యలు కార్పొరేట్ కంపెనీలకు అడవుల్లోని ఖనిజ సంపదను దోచిపెట్టడానికే అని ఆయన విమర్శించారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని, అలాగే చత్తీస్‌గఢ్‌లోని కర్రగుట్టలను చుట్టుముట్టిన వేలాది మంది సైన్యాన్ని వెనక్కి రప్పించాలని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కుంచె అంజిబాబు, పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్ పాల్గొన్నారు.